
సాక్షి
అనంతపురం

సోమవారం ၊ 6 ၊ అక్టోబర్ ၊ 2025



పెళ్లింట విషాదం

మెరవణిలో డీజే వాహనం చక్రాలకింద పడి పెళ్లికొడుకు తండ్రి దుర్మరణం పాలైన ఘటన విషాదం నింపింది. 8లో



టమాట కిలో రూ.18

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. సమర్పించిన అర్జీ పరిష్కార స్థితి గురించి కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ అర్జీలను పరిష్కార వేదికలోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్ సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు.

విజయవాడ వెళ్లిన కలెక్టర్

అనంతపురం అర్బన్: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. 'స్వచ్ఛ జిల్లా అవార్డు–2025'కు అనంతపురం ఎంపికైన విషయం విదితమే. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు. ఆయన తిరిగి ఏడో తేదీన విధులకు హాజరవుతారు.

ఒంటెద్దు కళ్లకు గంతలు కట్టి.. పదెకరాల్లో శనగ సాగు



ఒంటెద్దు కళ్లకు గంతలు కట్టి విత్తనం వేస్తున్న దుబ్బ గోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: మండలకేంద్రానికి చెందిన దుబ్బ గోపాల్‌రెడ్డి అనే రైతు చేసిన సాహసం అందరి చేత శభాష్ అనిపించేలా చేసింది. ఆదివారం ఆత్మకూరు సమీపంలోని పొలంలో పాళ్యం వెంకట నారాయణ రెడ్డి అనే రైతుకు సంబంధించిన ఎద్దుతో దుబ్బ గోపాల్‌రెడ్డి వినూత్న ప్రయోగం చేశాడు. ఆ ఎద్దు కళ్లకు గంతలు కట్టి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు పదెక రాల్లో శనగ విత్తనం సాగు చేసి అందర్నీ అబ్బురపరిచాడు. చాలా మంది కాడెద్దులతో విత్తన సాగు చేస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో పలువురు ఎద్దులకు బదులు ట్రాక్టర్లతో విత్తనం వేస్తున్నారు. కానీ దుబ్బ గోపాల్ రెడ్డి ఒక ఎద్దుతో అది కూడా దాని కళ్లకు గంతలు కట్టి పది ఎకరాల్లో తొమ్మిది గంటలలోపే విత్తన సాగు చేయడంపై రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీంతో ఆత్మకూరులో దుబ్బ గోపాల్‌రెడ్డితోపాటు సదరు వృషభానికి పూల మాలలు వేసి ఊరేగించారు.

సత్యసాయి సన్నిధిలో విజయ్ దేవరకొండ




శాంతిభవన్ అతిథి గృహంలోకి విచ్చేస్తున్న విజయ్ దేవరకొండ

ప్రశాంతి నిలయం: సినీ నటుడు విజయ్ దేవరకొండ ఆదివారం సత్యసాయి మహాసమాధి దర్శనార్థం పుట్టపర్తికి వచ్చారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో ప్రశాంతి నిలయం చేరుకున్న ఆయనకు శాంతిభవన్ అతిథి గృహం వద్ద సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్న తర్వాత సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

బీకేఎస్‌లో దొంగల హల్‌చల్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. దక్షిణామూర్తి నగర్‌లో నివాసం ఉంటున్న అనిల్ కుమార్, అశోక్ తమ ఇళ్లకు తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లారు. దుండగులు శనివారం అర్ధరాత్రి కుక్కకు మత్తు మందు పెట్టి తాళాలు బద్దలు గొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 5 తులాల బంగారు నగలు అపహరించారు. నలుగురు వ్యక్తులు చొరబడుతున్నట్లుగా సమీపంలోని ఇంటి వద్ద సీసీ కెమెరాలో కనిపించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎండిన ఆశలు



వీరాపురం సమీపాన తెగుళ్లు సోకిన వేరుశనగ పంట

వ్యవసాయ జూదంలో రైతన్న ఓడిపోతూనే ఉన్నాడు. ఆరుగాలం శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. కోటి ఆశలతో సాగు చేసిన వేరుశనగ పంట తుడిచిపెట్టుకుపోయే స్థితికి చేరింది. దీంతో ఖరీఫ్ రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. పెట్టుబడుల మాట అటుంచితే కనీసం గ్రాసం కూడా దక్కే పరిస్థితి కానరాక పోవడంతో అన్నదాతల ఆవేదన వర్ణనాతీతంగా మారింది.

- అగ్గి తెగులు దెబ్బకు వేరుశనగ రైతు విలవిల
- నెలలో పంట తొలగించాల్సిన సమయంలో కకావికలం
- పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతన్నలు

రాయదుర్గం: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటగా వేరుశనగ సాగవుతోంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 90 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగులోకి వచ్చింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లోనే అత్యధికంగా విత్తనాలు వేశారు. పంట ప్రస్తుతం పిందె దశలో ఉంది. మరో నెల రోజుల్లో దిగుబడి చేతికందుతుందనుకుంటున్న తరుణంలో ఇటీవల పంటకు తిక్క ఆకు మచ్చ (అగ్గి) తెగుళ్లు వ్యాపించాయి. ఆకుల్లోని రసం పీల్చేయడంతో చెట్లు నల్లగా మారాయి. మొన్నటిదాకా కళకళలాడిన పంట ఇప్పుడు కళావిహీనంగా మారడం, పురుగు మందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్లు అదుపులోకి రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా దక్కవు..

ఎకరా భూమిలో వేరుశనగ సాగుకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చవుతుంది. ఈ లెక్కన రూ.450 కోట్ల వరకూ పెట్టుబడుల కోసం రైతులు ఖర్చు చేశారు. ప్రస్తుతం తెగుళ్ల దాడికి పంట దెబ్బతినడంతో పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇలా చేస్తే కొంత మేలు..

లేత ఆకుమచ్చ తెగులు వేరుశనగ పంట వేసిన 30 రోజుల్లో కనిపిస్తుంది. మచ్చలు గుండ్రంగా ఉండి ఆకుల పైభాగాన ముదురు గోధుమ రంగులో ఉంటాయి. ముదురు ఆకు మచ్చ తెగులు ఆలస్యంగా కనిపించి మచ్చలు చిన్నవిగా, గుండ్రంగా ఉండి ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి. మచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఆకులు పసుపు రంగుకు మారి నిర్జీవమైపోతాయి. ఈ దశలో ఆకులతో పాటు కాండం, ఊడలపై కూడా మచ్చలు ఏర్పడతాయి. తెగుళ్లు కనిపించిన వెంటనే మాంకోజెబ్ 400 గ్రాములు లేదా కార్బండిజమ్ 200 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ 400 గ్రాములు లేదా హెక్సా కొనజోల్ 400 మి.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకుంటే కొంతమేర లాభముంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

శ్రమంతా వృథా



వర్షాధారంగా ఆరు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. పూత, పిందె వరకు పంట బాగుంది. ఇటీవల తిక్క ఆకుమచ్చ (అగ్గి) తెగులు పంటకు వ్యాపించింది. దీంతో పెట్టుబడులు కాదు కనీసం గ్రాసం దక్కని పరిస్థితి నెలకొంది. రూ.లక్ష దాకా పెట్టుబడితో పాటు ఆరుగాలం చేసిన శ్రమంతా వృథాగా మారింది.

– వడ్డే హనుమప్ప, రైతు, పూలకుంట, గుమ్మఘట్ట మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



వేరుశనగ పంట దారుణంగా దెబ్బతింది. నాలుగు ఎకరాల్లో సాగు చేస్తే అప్పులు మూట కట్టుకోవాల్సి వస్తోంది. వైరస్ దాడికి చెట్లన్నీ ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతుల్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు తక్షణ సాయంగా ఎకరాకు రూ.20 వేలు అందించాలి.

– వాల్మీకి గోవిందు, రైతు, రంగసముద్రం, గుమ్మఘట్ట మండలం

అశ్వత్థంలో జేసీ అలజడి



అశ్వత్థం క్షేత్రం వద్ద అనుచరులతో జేసీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: పుణ్యక్షేత్రమైన అశ్వత్థంలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అలజడి సృష్టించారు. ఆలయ ఆవరణలో ఉన్నఫళంగా రాళ్ల కుప్పలు ప్రత్యక్షం కావడం పెద్దపప్పూరు మండలంలో తీవ్ర చర్చకు దారితీసింది. వివరాలు...పెద్దపప్పూరు మండల అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామిరెడ్డి బొందలదిన్నె గ్రామంలో ఆదివారం విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించారు. విందుకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వస్తున్నారని ప్రచారం జరగడంతో తాడిపత్రి నుంచి బొందలదిన్నె మార్గమధ్యంలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం అశ్వత్థంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ క్రమంలో ఒక్కసారిగా అశ్వత్థం క్షేత్రంలో అలజడి రేగింది. ఇదే క్రమంలో ఆలయ ఆవరణలోని పెన్నానది ఒడ్డున రాళ్లకుప్పలు కనిపించడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. విందు కార్యక్రమానికి కేతిరెడ్డి పెద్దారెడ్డి వెళ్లలేదని తెలియడంతో జేసీ వెనుదిరగడం గమనార్హం.



ఆలయ సమీపంలో రాళ్లకుప్పలు

సా...గుతున్న ఈ–క్రాప్

- 42 శాతం వద్దే ప్రక్రియ
- ఈనెల 25 లోపు పూర్తి చేయాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు



కణేకల్లు మండలంలో ఈ–క్రాప్‌ను పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ పంటల సాగుకు సంబంధించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ–క్రాప్ ప్రక్రియ ఈ సారి మందకొడిగా సాగుతోంది. ఓ వైపు సాంకేతిక సమస్యలు, మరోవైపు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లకు ఇతరత్రా పని ఒత్తిళ్లు పెట్టడం, ఇంకోవైపు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పంటల నమోదుకు అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో తీసుకువచ్చిన ఈ–క్రాప్ ప్రక్రియ వల్ల రైతులకు అనేక రకాల ప్రయోజనాలు కల్పించడంతో పంట నమోదు చురుగ్గా, చాలా పారదర్శకంగా కొనసాగించారు. కానీ కూటమి సర్కారు ఈ–క్రాప్‌కు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అదే అదనుగా ఆయా శాఖల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఖరీఫ్ ముగిసిన సెప్టెంబర్ ఆఖరు నాటికే ఈ–క్రాప్ పూర్తి కావాలని ఆదేశాలు ఉన్నా 40 శాతం కూడా పూర్తి కాలేదు. తాజాగా అక్టోబర్ 25 నాటికి వంద శాతం పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయినా గడువులోపు వంద శాతం పూర్తి కావడం కష్టమేనంటున్నారు. ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ పంటలు ఇప్పటి వరకు 19.02 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ–క్రాప్‌లో మాత్రం ఇప్పటి వరకు 8 లక్షల ఎకరాలు నమోదు చేశారు. అంటే ఇప్పటి వరకు 42 శాతం పూర్తి చేశారు. గత రెండు నెలలుగా కేవలం 42 శాతం చేయగా... ఈ 20 రోజుల్లో 58 శాతం పూర్తి చేయడం అంత సులభం కాదని చెబుతున్నారు. సాగు చేసిన పంటలనే కాకుండా ఖాళీగా ఉన్న పొలాల వివరాలు కూడా ఈ–క్రాప్ చేయాలని నిబంధన పెట్టడంతో ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు తీవ్ర ఒత్తిడిలో ఉన్నట్లు తెలిసింది. మొత్తమ్మీద ఈ ఏడాది ఈ–క్రాప్ నమోదు పారదర్శకతపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ అంకారావుకు ఇంటర్నేషనల్ అవార్డు



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొగిలి అంకారావుకు ఇంటర్నేషనల్ ఇన్‌స్పిరేషనల్ టీచర్స్ అవార్డు–2025 దక్కింది. ఈ మేరకు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఐటూఓఆర్ సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం సూక్ష్మచిన్నతరహా పరిశ్రమల శాఖ ఆధీనంలో ఐటూఓఆర్ సంస్థ పనిచేస్తోంది. వినూత్న ఆవిష్కరణలకు దోహదపడే పరిశోధనలు చేస్తున్న వారికి అవార్డును ఏటా అందజేస్తున్నారు.మాజీ రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయ్‌కుమార్ పర్యవేక్షణలో అంకారావు విశేష పరిశోధనలు చేశారు. డాక్టరేట్ అందుకున్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇంటర్నేషనల్ ఇన్‌స్పిరేషనల్ టీచర్స్ అవార్డు దక్కిన సందర్భంగా అంకారావును వర్సిటీ వీసీ సుదర్శనరావు అభినందించారు.

పరిటాల దోపిడీకి సరిలేరెవ్వరూ

- అక్రమ సొమ్ముతోనే పరిటాల సునీత బెంజి కారులో తిరుగుతోంది
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిటాల వారి దోపిడీకి ఎవరూ సరిలేరని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్కలపల్లి టమాట మండీలో రోజూ రూ. 5 లక్షలు శ్రీరామ్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. ధర్మవరం, అనంతపురం, చెన్నేకొత్తపల్లిలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రోజూ రూ. 25 లక్షలు పరిటాల ఇంటికి వెళ్తోందన్నారు. నియోజకవర్గంలో వెయ్యి బెల్ట్‌షాపులుండగా, నిత్యం ఒక్కో షాపు నుంచి రూ. 2 వేలు పరిటాల కుటుంబం పేరుతో వసూలు చేస్తున్నారన్నారు. చివరకు నసనకోట ముత్యాలమ్మ గుడినీ వదల్లేదని, అక్కడి బెల్ట్‌షాపు నుంచి రోజూ రూ. లక్ష వెంకటాపురంలోని వారి ఇంటికి వెళ్తోందన్నారు.

ఆదాయం చాలా ఎక్కువ..

పరిటాల కుటుంబీకులకు వెంకటాపురంలో కాకుండా అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, ధర్మవరంలో ఉన్న భవనాల విలువ రూ. 150 కోట్లు అని, ఇక.. కాంప్లెక్స్‌లు, కియా వద్ద భూములు, గ్రానైట్ క్వారీల గురించి మాట్లాడడం లేదన్నారు. ఆదాయం ఎక్కువైపోయి హైదరాబాద్, బెంగళూర్‌లో పబ్‌లు కూడా ఏర్పాటు చేశారని, ఇవీ చాలవన్నట్లు అమెరికాలో రెండు, ఆఫ్రికాలో ఒకచోట లిక్కర్ ఫ్యాక్టరీలు తెరిచారన్నారు. 'మీ చరిత్ర తెలిసే లోకేష్ మీకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు' అని విమర్శలు గుప్పించారు. పెద్ద ఎత్తున ఆదాయ వనరులు ఏర్పాటు చేసుకుని కూడా పాపంపేటలో 300 ఎకరాల శ్రోత్రియం భూములపై పడ్డారన్నారు. అదికూడా చాలదని 999 ఎకరాలు కావాలని అడుగుతున్నారని ఆరోపించారు. పాపంపేటలో దుర్మార్గంగా 20 ఇళ్లను నేలమట్టం చేశారన్నారు.

రూ. 3 కోట్ల విలువైన బెంజి కారులో..

అక్రమ ఆదాయంతోనే నేడు పరిటాల సునీత రూ. 3 కోట్ల విలువైన బెంజి కారులో తిరుగుతోందన్నారు. 'సునీతమ్మా...తోపుదుర్తిలో మహిళలు నీ మీద రెండు ట్రాక్టర్ల చెప్పులు విసిరారు. 2 వేల మంది పోలీసులతో వచ్చినా ఆరు గంటలపాటు గ్రామంలోకి రాలేకపోయావు. ప్రజలు తిరగబడితే ఎలా ఉంటుందో 164 మంది ఎమ్మెల్యేలకంటే నీకే బాగా తెలుసు. 50 వేల మంది ఇళ్ల నిర్మాణాలు జరగకుండా ఆపినావు. ఆ 50 వేలమంది చెప్పులు విసిరితే ఆ గుట్టలో నువ్వు కనిపిస్తావా' అని మండిపడ్డారు. 'నువ్వేమైనా మైసూరు మహారాణి అనుకుంటున్నావా..? పథకాలు అడిగితే చెప్పులు చూపిస్తావా.. పేదలకు ఇళ్ల నిర్మాణాలు జరగలేదని మాట్లాడితే చెప్పు తెగుతుందంటావా.. నీకు ప్రజలే చెప్పులు చూపించే రోజులు వస్తాయి' అంటూ మండిపడ్డారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, అనంతపురం, రాప్తాడు వైస్ ఎంపీపీలు కృష్ణారెడ్డి, బోయ రామాంజి, నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి, బండి పవన్, లింగారెడ్డి, ఆలమూరు ఓబులేసు, శేఖర్, సత్తిరెడ్డి, మాదన్న, మునిశంకరయ్య, ఈశ్వరయ్య, మీనుగ నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో భారీ స్కాం

కూటమి ప్రభుత్వంలో పక్కా ఇళ్ల నిర్మాణాల్లో భారీ స్కాం జరుగుతోందని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇల్లు సొంతంగా నిర్మించుకోలేమనే లబ్ధిదారులకు ప్రభుత్వమే కేవలం రూ.1.80 లక్షలకే ఇల్లు నిర్మించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అయితే.. ప్రభుత్వం మారిన తర్వాత ఈ ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయన్నారు. వాటి గురించి కూటమి ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోవడం లేదన్నారు. పైగా కూటమి ఎమ్మెల్యేలు కొత్త స్కాంకు తెర తీశారన్నారు. ప్రతి ఇంటికీ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లకు ఛాలెంజ్ చేస్తున్నానని, వారికి చేతనైతే ఇది అబద్ధమని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

పంతానికి పోయి ప్రాణమే తీశారు..!

- తీవ్ర చర్చనీయాంశమైన శిశుగృహలో బాలుడి మృతి
- సిబ్బంది నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు
- గతంలోనూ వివాదాస్పదం
- కలెక్టర్ దృష్టి సారిస్తేనే అన్నీ కొలిక్కి

> నవమాసాలు మోసి జన్మనిచ్చినా గంటల వ్యవధిలోనే కాదనుకొని ముళ్ల పొదల్లో పడేశావు. ఈ భూమిపై జీవించే ప్రాప్తం లేదని అనుకున్నా.. అధికారులు వచ్చి అక్కున చేర్చుకున్నారు. శిశుగృహకు తీసుకువస్తే బతకనిస్తారు అని భావించా. ఇక్కడ చూస్తే గ్రూపులతో నాకు పాలు కూడా పట్టలేదు. ఎంత ఏడ్చినా వినిపించుకునే నాథుడు లేరు. ఏడ్చి.. ఏడ్చి నా ప్రాణం పోయింది. ఎందుకమ్మా నాకు ఇలాంటి జన్మనిచ్చావు.
>
> – శిశుగృహలో ఆకలితో అలమటించి మృత్యువాత పడిన చిన్నారి ఆక్రందన ఇది.



శిశుగృహలో సిబ్బందిని విచారిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం సెంట్రల్: ఊపిరి పోస్తారనుకున్న వారు ఆయువే తీశారు. గుట్టు చప్పుడు కాకుండా ఖననం చేశారు. మహిళా,శిశు సంక్షేమశాఖ పరిధిలోని శిశుగృహలో నవజాత శిశువు ఆకలితో మృతి చెందిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. స్వయంగా సీఎం చంద్రబాబు స్పందించారు. దీంతో మహిళా,శిశు సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం రాత్రి జిల్లాకు వచ్చారు. ఎస్పీ జగదీష్‌కు కూడా విచారణ బాధ్యతలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఘటనపై సమగ్ర విచారణకు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, సర్వజనాసుపత్రి చిన్నపిల్లల వైద్యులు ప్రవీణ్ సభ్యులుగా కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని ప్రకటించారు. ఆదివారం కమిటీ సభ్యులు శిశుగృహలో విచారణ చేపట్టారు.

అనుమానాలెన్నో..

అనారోగ్యంతో నవజాత శిశువు మృతి చెందాడని శిశుగృహ సిబ్బంది చెబుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 20 రోజుల క్రితం కళ్యాణదుర్గం వద్ద ముళ్ల పొదల్లో శిశువు దొరికాడు. ఆస్పత్రిలో చికిత్సల అనంతరం ఆరోగ్యం మెరుగవడంతో శిశుగృహకు రెఫర్ చేశారు. ఈ క్రమంలో మళ్లీ అనారోగ్యం పాలైతే ప్రభుత్వాసుపత్రిలో ఎందుకు చేర్పించలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కాగా, ఇటీవల శిశుగృహలో పనిచేసే ఇద్దరు ఆయాలు గొడవపడినట్లు తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం ఒకరు విధులకు రాలేదు. దీంతో మరో ఆయా ఆక్రోశంతో పిల్లలను పట్టించుకోలేదు. అప్పుడు ఐదుగురు ఆడ శిశువులు, ఒక మగశిశువు ఉన్నాడు. పాలు పట్టించకపోవడంతో పిల్లాడు ఏడ్చి ఏడ్చి ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందిగా మారింది. అర్ధరాత్రి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే, విషయం బయటకు పొక్కితే మేనేజర్, సోషల్‌వర్కర్, ఏఎన్‌ఎం, ఆయాలకు ఇబ్బంది వస్తుందని గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేసినట్లు తెలుస్తోంది.

తెరవెనుక మంత్రాంగం

శిశువు మృతికి కారణమైన వారిని పక్కన పెట్టి సెలవు పెట్టిన ఆయాపై చర్యలు తీసుకొని మమ అనిపించేందుకు కొంతమంది తెరవెనుక మంత్రాంగం నడిపిస్తున్నారు. శుక్రవారం విధుల్లో ఉన్న ఆయాపై చాలా ఆరోపణలు ఉండడం గమనార్హం. గతంలో పసికందులను గిచ్చడం, గోర్లతో రక్కి గాయపరచడం వివాదాస్పదమైంది.

అవినీతి మరకలు..

శిశుగృహలో పనిచేస్తున్న సిబ్బంది అందరిపైనా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గతంలో దత్తత కోసం వచ్చిన ఓ ఎన్‌ఆర్‌ఐ మహిళను ప్రస్తుత మేనేజర్ డబ్బు డిమాండ్ చేయడం.. దీంతో ఎన్‌ఆర్‌ఐ ఢిల్లీలోని విదేశీ రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేయడం.. అప్పటి కేంద్ర మహిళ,శిశు సంక్షేమశాఖ మంత్రి ఆదేశాలతో కలెక్టర్ వీరపాండియన్ మేనేజర్‌ను విధుల నుంచి తొలగించడం సంచలనం సృష్టించింది. అయితే కోర్టు ఆదేశాలతో తిరిగి ఆమె అదే ఉద్యోగంలో కొలువు దీరడం గమనార్హం. అలాగే సోషల్ వర్కర్ కూడా హిందూపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళను బంగారు గొలుసు కోసం డిమాండ్ చేసి నగరంలో ఓ నగల దుకాణంలోకి తీసుకెళ్లడంతో బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమెను వన్‌స్టాప్ సెంటర్‌కు బదిలీ చేయగా.. ఓ అధికారిణిని ప్రసన్నం చేసుకొని మళ్లీ శిశుగృహకు వచ్చారనే విమర్శలు ఉన్నాయి.

అందరికీ మెమోలు

తప్పు చేసిన వారిపై చర్యలు ఉంటాయి. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. చిన్నపిల్లలు ఉన్న చోట తరచూ గొడవ పడుతుంటే ఏం చేస్తున్నావని మేనేజర్‌తో సహా ఆరుగురు సిబ్బందికీ మెమోలు ఇచ్చాను.

– నాగమణి, పీడీ, ఐసీడీఎస్

క్లుప్తంగా

ముందుకు సాగని సమీకృత భవన నిర్మాణ పనులు



ఖజానా శాఖ సమీకృత భవనం కోసం గుర్తించిన 50 సెంట్ల స్థలం ఇదే

అనంతపురం అర్బన్: ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే శాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సమీకృత ఆర్థిక భవనం (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్) ఏర్పాటు ప్రక్రియ ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే ఖజానా, స్టేట్ ఆడిట్, పే అండ్ అకౌంట్స్, ఏపీజీఎల్ఐ శాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండాలనే ఉద్దేశంతో సమీకృత ఆర్థిక భవనం ఏర్పాటుకు 2016లోనే ఆర్థికశాఖ రూ.10కోట్ల నిధులు మంజూరు చేసింది. అనంతపురంలోని శారదానగర్‌లో ఉన్న సేవా సదనం వెనుక 50 సెంట్లు స్థలాన్ని గుర్తించారు. ఇందుకు సంబంధించి నివేదికను అప్పటి ఆర్డీఓ కలెక్టరేట్‌కు అందజేశారు. ఈ క్రమంలోనే నగర పాలక సంస్థ నుంచి ఖజానా శాఖ క్లియరెన్స్ తీసుకుంది. ఇదే సమయంలో అప్పటి కలెక్టర్ నాగలక్ష్మి బదిలీ కావడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో సమీకృత ఆర్థిక భవన నిర్మాణ అంశంలో కలెక్టర్ ఓ.ఆనంద్‌పై ఖజానాశాఖ అధికారులు, ఉద్యోగులు ఆశలు పెట్టుకున్నారు.

సొంతింటి కల ఛిద్రం



పిచ్చి మొక్కలతో నిండిన కొడిమి జగనన్న కాలనీలోని ఇళ్ల పునాదులు

అనంతపురం టౌన్: సామాన్యుల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేసింది. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులు ముందుకు సాగకుండా కోర్టులను ఆశ్రయించి కుట్ర చేసింది. దీంతో ఇళ్ల నిర్మాణ పనులు మొదటి దశలోనే ఆగిపోయాయి. అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామ పంచాయతీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయడంతోపాటు ఇంటి నిర్మాణ పనుల బాధ్యతను సైతం ప్రభుత్వమే తీసుకుంది. కొన్ని నిర్మాణ పనులు పూర్తి చేసింది. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ఇంటి నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. దీంతో పునాదుల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

సరుకులు స్టాక్ పాయింట్‌లోనే..

- 10 రోజులైనా అంగన్‌వాడీ కేంద్రాలకు చేరని వైనం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలిచిపోయిన రవాణా
- సరుకుల కోసం ఎదురుచూస్తున్న అంగన్‌వాడీ లబ్ధిదారులు



మూసివేసిన తాడిపత్రిలోని స్టాక్‌పాయింట్

తాడిపత్రి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలంటే కూటమి ప్రభుత్వానికి అలుసుగా మారింది. ఇప్పటికే రెండు నెలల జీతం, అద్దెలు, ఇతర బిల్లుల మంజూరులో మీనమేషాలు లెక్కిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం తాజాగా మరో వివాదానికి తెరతీసింది. సకాలంలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయకుండా తన చేతకానితనాన్ని మరోసారి బయటపెట్టుకుంది.

మొదటి వారంలోనే సరుకుల పంపిణీ..

ప్రతి నెలా మొదటి వారంలోనే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు బియ్యం, కందిబేడలు, నూనె, కోడిగుడ్లు, పాలు, బాలసంజీవిని, బాలామృతం కిట్లు పంపిణీ చేస్తారు. ఈ నెల 6వ తేదీ వచ్చినా ఇప్పటి వరకూ ఒక్క సరుకు కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు చేరలేదు. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు పంపిణీ చేయాలో తెలియక అంగన్‌వాడీ టీచర్లు సతమతమవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 25 అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి నెలా ఒకటో తేదీన చౌకధాన్యపు డీలర్లకు లారీల్లో అందే సరుకులను అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్లు ఆటోల ద్వారా తరలిస్తుంటారు.

అయోమయంలో 3.20 లక్షల మంది..

ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 5,125 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 3.20లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. 8వేల మందికి పైగా గర్భిణులు, 24వేల మందికి పైగా పాలిచ్చే తల్లులు, 0–6 వయస్సు గల పిల్లలు 2.60 లక్షల మంది ఉన్నారని అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి నెలా నాలుగు విడతలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా అవుతాయి. గర్భిణులు, బాలింతల కోసం ప్రతి నెలా మూడు కిలోల బియ్యం, కిలో కందిబేడలు, అర కిలో నూనె, 25 కోడిగుడ్లు, తల్లులకు 5 లీటర్ల పాలు, చిన్నారులకు 2.5 లీటర్ల పాలు, బాలసంజీవిని కిట్‌లను పంపిణీ చేస్తారు. అయితే ఈ నెల ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని పౌరసరఫరాల స్టాక్‌పాయింట్లకు పది రోజుల క్రితమే చేరుకున్న సరుకులు అక్కడే నిలిచిపోయాయి.

రిలీజ్ ఆర్డర్ లేకుండానే డిస్పోజ్ ఆర్డర్!

స్టాక్ పాయింట్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులను రవాణా చేయడానికి ఉన్నతాధికారుల నుంచి ముందుగా రిలీజ్ ఆర్డర్ ఉండాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఈ సారి రిలీజ్ ఆర్డర్ లేకుండానే ఏకంగా డిస్పోజ్ ఆర్డర్ అందడంతో కింది స్థాయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విషయాన్ని కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు ప్రయత్నం చేశారు. అయితే ఈ ప్రయత్నాలు విఫలమైనట్లు సమాచారం.

సాంకేతిక సమస్యతోనే..



సాంకేతిక సమస్య కారణంగా రిలీజ్ ఆర్డర్ (ఆర్ఓ)లు అందలేదు. దీంతో స్టాక్ పాయింట్ల నుంచి సరుకులు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కాలేదు. సమస్య పరిష్కారం కాగానే సరుకులను అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుస్తాం.

– రమేష్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి, అనంతపురం

కేంద్రాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు..

ప్రతి నెలా 1వ తేదీ నేరుగా డీలర్ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు పంపిణీ చేస్తుంటారు. నెలలో నాలుగు విడతలుగా కోడిగుడ్లను కాంట్రాక్టర్లు సరఫరా చేయాల్సి ఉండగా రవాణా ఖర్చుల భారం కారణంగా రెండు పర్యాయాలు చొప్పున నెలలో 1వ తేదీ, 15వ తేదీల్లో రవాణా చేస్తున్నారు. అయితే ఈ సారి అంగన్‌వాడీ కేంద్రాలకు బాలసంజీవని, కోడిగుడ్లు, పాలు, బాలామృతం ప్యాకెట్లు సరఫరా కాలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకులు నిండుకున్నాయి. సరుకుల కోసం రోజూ బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి సరుకులు రాలేదని చెప్పలేక అంగన్ వాడీ టీచర్లు ఇబ్బంది పడుతున్నారు.

పెళ్లింట విషాదం

- మెరవణిలో దూసుకొచ్చిన డీజే వాహనం
- చక్రాల కింద పడి పెళ్లికొడుకు తండ్రి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



తిరుమలయ్య (ఫైల్)

కనగానపల్లి: పెళ్లింట విషాదం చోటు చేసుకుంది. మెరవణి సమయంలో డీజే వాహనం అదుపుతప్పి మనుషులపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో పెళ్లికొడుకు తండ్రి దుర్మరణం చెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. కనగానపల్లికి చెందిన చిన్న తిరుమలయ్య (55), సరస్వతి దంపతులు. టీ హోటల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శివానంద వివాహం ఆదివారం పెనుకొండ సమీపంలోని గుట్టూరు వద్ద ఇందు అనే యువతితో జరిగింది. మధ్యాహ్నం బంధువులంతా తిరిగింపుల కోసం పెళ్లి కుమారుని స్వగ్రామం కనగానపల్లికి వెళ్లారు. సాయంత్రం వధూవరులతో కలిసి బంధుమిత్రులు సంతోషంగా మెరవణిలో పాల్గొన్నారు. డీజే కోసం ఏర్పాటు చేసిన వాహనం అదుపుతప్పి మెరవణిలో నడుచుకుంటూ వెళ్తున్న వారిపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో వాహనం ముందు భాగాన ఉన్న పెళ్లి కుమారుడు తండ్రి చిన్న తిరుమలయ్య, ఆయన సోదరుడు ఆదెప్ప చక్రాల కింద పడ్డారు. వీరిలో చిన్న తిరుమలయ్య తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఆదెప్పను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతవరకూ సంతోషంగా సాగిన వేడుక ఈ ఘటనతో విషాదంగా మారిపోయింది.

రెండు రోజుల్లోనే 191 ఫైళ్లకు పరిష్కారం

అనంతపురం అర్బన్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లోఉన్న 22ఏ (నిషేధిత భూముల) జాబితా ఫైళ్లకు పరిష్కారం లభించింది. 2024, జూన్ 15 తరువాత 22ఏ ఫైళ్లు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో పెండింగ్ ఫైళ్ల అంశంపై 'సారూ... దృష్టిసారించండి' శీర్షికన గత నెల 17న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. వెనువెంటనే ఫైళ్ల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గత నెల 26, 27 తేదీల్లో చేపట్టిన తొలి విడత ప్రత్యేక డ్రైవ్‌లో 32 మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు అందరూ పాల్గొని ఫైళ్లను పరిశీలించి సిద్ధం చేశారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆర్డీఓల నేతృత్వంలో చేపట్టిన ఈ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల పర్యవేక్షించారు. తొలి విడతలో 487 ఫైళ్ల పరిష్కారం లక్ష్యంగా విధించగా పరిశీలన అనంతరం 191 ఫైళ్లను సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించారు. వీటిలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్న 83 ఫైళ్లను కలెక్టర్ ఆమోదించారు. కళ్యాణదుర్గం డివిజన్‌కు సంబంధించి ఒక ఫైలు పునఃపరిశీలనకు ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 107 ఫైళ్లను తిరస్కరించారు. రెండవ విడత ప్రత్యేక డ్రైవ్ మరో 10 రోజుల తరువాత నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

'దుర్గం'లో వరుస చోరీలు

రాయదుర్గంటౌన్: స్థానిక ఇందిరమ్మ లేఔట్‌లో పక్కపక్కనే ఉన్న మూడిళ్లలో ఒకే రోజు దుండగులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించారు. శుభకార్యాల నిమిత్తం శనివారం ఇళ్లకు తాళం వేసిన బాధిత యజమానులు ఆదివారం మధ్యాహ్నం తిరిగి వచ్చిన తర్వాత చోరీల విషయం వెలుగు చూసింది. పట్టణంలోని ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్న జబీవుల్లా ఇంటికి తాళం కుటుంబసభ్యులతో కలసి కర్ణాటకలోని చెళ్లికెరకు వెళ్లారు. మరో బాధితుడు మేస్త్రీ బాషా, ముబీనా ఇంటికి తాళం వేసి శుభకార్యం నిమిత్తం కణేకల్లుకు వెళ్లారు. గేటు బీగాలతోపాటు ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి దుండగులు లోపలకు చొరబడ్డారు. జబీవుల్లా ఇంట్లో రూ.50 వేల నగదు, 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల వెండి అపహరించారు. మేస్త్రీ భాషా, ముబీనా ఇంట్లో రూ.50 వేల నగదు, 50 తులాల వెండి ఆభరణాలు, 10 గ్రాముల బంగారు అపహరించారు. అలాగే హిజ్రాలు నివాసముంటున్న మరో ఇంట్లోనూ దుండగులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించారు. వారికి సమాచారం ఇచ్చేందుకు వీలు కాలేదని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బీకేఎస్‌లో దొంగల హల్‌చల్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని దక్షిణామూర్తి నగర్‌లో నివాసం ఉంటున్న అనిల్ కుమార్, అశోక్ తమ ఇళ్లకు తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లారు. గుర్తించిన దుండగులు శనివారం అర్ధరాత్రి తాళాలు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 5 తులాల బంగారు నగలు అపహరించారు. నలుగురు వ్యక్తులు ఇళ్లలోకి చొరబడుతున్నట్లుగా ఓ ఇంటి ఆవరణలోని సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

డి హీరేహాళ్(రాయదుర్గం): పేకాట ఆడుతూ తొమ్మిది మంది పట్టుబడినట్లు డి.హీరేహాళ్ పీఎస్ ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం డి.హీరేహాళ్ మండలం గొడిశెలపల్లి వద్ద తనిఖీలు చేపట్టగా జూదరులు పట్టుబడ్డారన్నారు. వారి నుచి రూ.18,450 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థి మృతి



నాగప్రతాప్ (ఫైల్)

యాడికి: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలను ఆదివారం వెల్లడించారు. యాడికిలోని చింతవనం ఆంజనేయ స్వామి వీధిలో నివాసముంటున్న వెంకటరంగడుకు ఇద్దరు కుమారులు కాగా, పెద్దకుమారుడు నాగ ప్రతాప్(19) గుత్తి సమీపంలోని గేట్స్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా పండుగ రోజు సాయంత్రం రాయలచెరువు రహదారిలో వాకింగ్ చేస్తుండగా నాగ ప్రతాప్‌ను వేములపాడు గ్రామానికి చెందిన మహబూబ్ బాషా కుమారుడు మన్సూర్ ద్విచక్ర వాహనంపై వెళుతూ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగప్రతాప్‌ను కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు

చికిత్స పొందక వ్యక్తి మృతి



మృతుడు నీలకంఠ

రాయదుర్గం టౌన్/గుమ్మఘట్ట: మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి సరైన వైద్య చికిత్స పొందక నీలకంఠ(42) అనే వ్యక్తి మృతి చెందాడు. గుమ్మఘట్ట మండలం పూలకుంటకు చెందిన నీలకంఠ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. గురువారం రాయదుర్గంలోని 19వ వార్డులో ఉన్న తన భార్య పుట్టింటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా వీరాపురం తండా వద్ద అదుపు తప్పి కిందపడి తలకు బలమైన గాయమైంది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం వెళ్లాలని వైద్యులు సూచించారు. అయినా వెళ్లకుండా స్థానికంగా భార్య పుట్టింట్లోనే ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి పరిస్థితి విషమించడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య శిల్ప, ఓ కుమారుడు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల పరస్పర ఢీ

కళ్యాణదుర్గం: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ ఆదివారం రాత్రి కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మల్లాపురం రైల్వే గేట్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న నవీన్, అతని స్నేహితుడు ఢీకొన్నారు. ఘటనలో సూర్యప్రకాష్‌తో పాటు నవీన్, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ నేతల కనుసన్నల్లోనే కల్తీ మద్యం తయారీ

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: టీడీపీ నేతల కనుసన్నల్లోనే కల్తీ మద్యం తయారీ సాగుతోందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందిస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత చంద్రబాబు విస్మరించారన్నారు. రాష్ట్రాన్ని కల్తీ మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చారని ధ్వజమెత్తారు. కల్తీ మద్యం తాగి వందలాది మంది మరణిస్తున్నారని, వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వైఎస్ జగన్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టడంతో ప్రభుత్వ ఖజానాకే రూ. వేల కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ఎంతో పారదర్శకంగా నాడు మద్యం పాలసీని అమలు చేశారన్నారు. అనధికారిక బెల్టు షాపులను టీడీపీ నేతలు నిర్వహిస్తూ నిరుపేద కుటుంబాలను దోచుకుంటున్నారన్నారు.

అవమాన భారంతో 'హంద్రీ-నీవా'లో దూకాడు!



కాలువ వద్ద గాలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ఓ మహిళ చెప్పుతో కొట్టడంతో గ్రామంలో పరువు పోయిందంటూ మనోవేదనకు లోనై ఓ వ్యక్తి హంద్రీనీవా కాలువలో దూకాడు. ఈత రాకపోవడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం పంపనూరు తండాలో శనివారం కుళాయి గేట్‌వాల్వ్‌కు సంబంధించి లక్ష్మీనారాయణకు ఆయన పక్కింటి వారి మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ సమయంలో లక్ష్మీనారాయణను పక్కింటి మహిళ చెప్పుతో కొట్టింది. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మీనారాయణ ఘటనపై ఫిర్యాదు చేయడానికి వెళితే... 'ఎప్పుడూ ఏదో ఒక గొడవ పెట్టుకుని వస్తుంటావు' అంటూ పోలీసులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో మనోవేదనకు లోనైన లక్ష్మీనారాయణ అదే రోజు సాయంత్రం ఆత్మకూరు నుంచి పంపనూరు తండా వరకూ నడుచుకుంటూ వెళ్లాడు. తనను చెప్పుతో కొట్టారని.. ఊళ్లో వాళ్లకి ముఖం చూపించలేనంటూ మార్గమధ్యంలో హంద్రీ-నీవా కాలువలో దూకాడు. ఈత రాకపోవడంతో ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. అతని వెనకాలే ఉన్న కుమారుడు, బామ్మర్ది కేకలు వేసినా చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. విషయాన్ని వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా వారు సకాలంలో స్పందించలేదని బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆదివారం ఉదయం గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బందితో లక్ష్మీనారాయణ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. కాగా, లక్ష్మీనారాయణకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్ పటిష్టతపై నిఘా పెట్టండి : డీఆర్‌ఎం



డీఈఎన్‌కు సూచనలిస్తున్న డీఆర్‌ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు: రైల్వే ట్రాక్ పటిష్టతపై ప్రత్యేక నిఘా పెట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదేశించారు. గుంతకల్లు–అనంతపురం సెక్షన్‌లో డీఈఎన్ మణికంఠతో కలిసి ఆదివారం ప్రత్యేక రైలులో ప్రయాణిస్తూ రైలు మార్గం పటిష్టతను ఆయన పరిశీలించారు. ట్రాక్ భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను డీఈఎన్‌కు వివరించారు.

'గుంటూరు'పై 'అనంత' విజయం



విజయం సాధించిన అనంతపురం జట్టు

అనంతపురం: ఆర్డీటీ క్రీడా మైదానం వేదికగా ఆదివారం ప్రారంభమైన జర్నలిస్టు రాష్ట్ర స్థాయి క్రికెట్ లీగ్ పోటీల్లో గుంటూరు జట్టుపై అనంతపురం జట్టు విజయం సాధించింది. జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు సాగే ఈ టోర్నీని ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. తొలి మ్యాచ్‌ను అనంతపురం, గుంటూరు జట్ల మధ్య నిర్వహించారు. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం సుధీర్ జట్టు 15 ఓవర్లకు గాను 109 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుంటూరు జట్టు 15 ఓవర్లలో 88 పరుగుల వద్ద చతికిలపడింది. దీంతో అనంతపురం సుధీర్ జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రితో పాటు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ విశిష్ట అతిథులుగా హాజరై మాట్లాడారు. వృత్తి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లతో సతమతమవుతున్న జర్నలిస్టులకు క్రీడలు మనో వికాసానికి దోహదపడతాయన్నారు. జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు రేపటి రామాంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మొండి ప్రభుత్వం మెడలు వంచుదాం

- వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై మొండిగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం మెడలు వంచుదామని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7న విజయవాడ వేదికగా ఫ్యాప్టో తలపెట్టిన రాష్ట్రస్థాయి ధర్నాకు వైఎస్సార్‌టీఏ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ వైఖరిని అవలంభిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఇప్పటి వరకూ ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. ప్రభుత్వం రాగానే పెండింగ్ బకాయిలన్నీ చెల్లిస్తామని, మంచి ఫిట్మెంట్‌తో పీఆర్సీ ఇస్తామని, ఐఆర్ ప్రకటిస్తామని మెనిఫెస్టోలో కూడా పెట్టారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు



కాలువలో గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

వజ్రకరూరు: ఐదు రోజుల క్రితం హంద్రీ-నీవా కాలువలో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు కొనసాగుతూ ఉన్నాయి. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ ఎం.రామాంజనేయులు ఈ నెల 1న ఛాయాపురం వద్ద ఉన్న హంద్రీనీవా ప్రధాన కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. రెండు రోజులుగా రెవెన్యూ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో ఆదివారం ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలో దిగాయి. ఛాయాపురం నుంచి రాగులపాడు లిఫ్ట్ వరకూ హంద్రీ-నీవా ప్రధాన కాలువలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించాయి. చీకటి పడుతున్నా ఆచూకీ లభ్యం కాలేదు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా, ఐదు రోజులవుతున్నా వ్యక్తి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

మమ్మీడాడీ కావాలి!



తల్లిదండ్రులతో ఆద్విక్ (ఫైల్)

ఉరవకొండ: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందారనే విషయం తెలియని నాలుగేళ్ల బాలుడు తనకు మమ్మీ.. డాడీ కావాలంటూ రోదిస్తుండడంతో వైద్య సిబ్బందితో పాటు రోగులూ కన్నీటి పర్యంతమవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 4న విడపనకల్లు వద్ద రెండు కార్లు ఢీకొన్న విషయం తెలిసిందే. ఘటనలో పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో సీనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న విశాఖనగరానికి చెందిన రామ్‌సుధీర్ భార్య లావణ్య అక్కడికక్కడే మృతి చెందగా, అనంతపురంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ రామ్‌సుధీర్ సైతం మృతిచెందాడు. వీరి కుమారుడు ఆద్విక్ కాలు విరిగి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అంతటి నొప్పిలోనూ తన తల్లిదండ్రుల కోసం చిన్నారి పరితపిస్తూ రోదిస్తున్నాడు. చిన్నారి రోదన చూసిన వారి హృదయాలు బరువెక్కిపోతున్నాయి.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మృతి

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సరస్వతి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె మృతిపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు సంతాపం తెలిపారు.



శేష వాహనంపై శ్రీవారు

తాడిపత్రి రూరల్: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తాడిపత్రిలోని చింతల వేంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం శేష వాహన సేవలు అంగరంగ వైభవంగా సాగాయి. ఉదయం చింతల వేంకటరమణ స్వామి, లక్ష్మీ అమ్మవారి మూలవిరాట్‌లకు అర్చకులు మురళీస్వామి బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సమేత చింతల వేంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను శేషవాహనంపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. దేవేరులతో కలసి శ్రీకృష్ణుడి అలంకరణలో శ్రీవారు దర్శనమివ్వడంతో భక్తులు పులకించిపోయారు.

క్లుప్తంగా

'పరిష్కార వేదిక'కు హాజరుకండి

రాప్తాడు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో ఉండి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తీసుకుని.. గడువులోపు పరిష్కరించాలన్నారు.

గురువులతోనే ఉత్తమ సమాజం



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్: మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజం గురువులతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అన్నారు. ఆదివారం నగరంలోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. చిత్తప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ అంతర్జాతీయ విద్య వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ ప్రతి అక్టోబర్ 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకునేలా కృషి చేసిందన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ వ్యవస్థను బోధన కన్నా ఇతర పనులకు వినియోగించుకోవడంతో అనుకున్న ఫలితాలు సాధించడంలో విఫలమవుతున్నామన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు ఎస్ఎం బాషా, జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ప్రసూన, ప్రధాన కార్యదర్శి వీర్రాజు, శ్రీనివాసరావు, తిరుపాలు, రాఘవేంద్ర, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు వాల్మీకి జయంతి

అనంతపురం రూరల్: నగరంలో ఈ నెల ఏడున వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు పాతూరులోని పవర్ ఆఫీస్ దగ్గర ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాల అలంకరణ ఉంటుందని తెలిపారు. 10.30 గంటలకు రుద్రంపేటలోని వాల్మీకి భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వాల్మీకి సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ప్రమాదం జరిగితే తప్ప పట్టించుకోరా?


చేతికందేలా ఉన్న విద్యుత్ వైర్లను చూపుతున్న స్థానికులు

ఆత్మకూరు: పి.యాలేరు గ్రామంలో ప్రధాన రహదారిలో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకో లేదని స్థానికులు చెబుతున్నారు. వాహనాలు వెళ్తున్నప్పుడు తగులుతున్నాయని, ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంతల ఆదాయం రూ.2.95 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.95 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.1,87,050 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత నుంచి రూ.1,08,600 మేర వసూలైనట్లు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని మదర్‌థెరిస్సా కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫెన్సింగ్ లేదు. ఎదురుగానే అంగన్‌వాడీ కేంద్రం ఉండటంతో ఏక్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అక్కడ నిత్యం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతుండటంతో స్థానిక ప్రజలు సైతం భయం గుప్పిట్లో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లే పశువులకు ఆవాసాలు

- రాత్రింబవళ్లూ సంచారం
- వాహనదారులకు, స్థానికులకు తప్పని తిప్పలు
- పాలు పిండుకుని రోడ్లపైకి వదిలేస్తున్న యజమానులు


చిన్మయనగర్‌లో జేఎన్‌టీయూ మెయిన్ రోడ్డు మీద సంచరిస్తున్న పశువులు


ఇందిరమ్మ కాలనీలో రోడ్డుపై తిష్ట వేసిన పశువులు

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ ప్రధాన రహదారులు పశువుల పాకలుగా మారాయి. జేఎన్‌టీయూ మెయిన్ రోడ్డు మీదుగా చిన్మయనగర్, ఆడిటర్స్ కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ వరకు దాదాపు రెండు కిలో మీటర్ల మేర పశువులు రోడ్డుపై తిష్టవేస్తున్నాయి. పశువుల యాజమానులు పాలు పిండుకొని వాటిని బయటకు వదిలేస్తుండడంతో అవి రోడ్ల మీదకొచ్చేస్తున్నాయి. రోడ్లపై పడి ఉన్న వ్యర్థాలను తింటూ ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్, ఆడిటర్స్ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కళాకారుల కాలనీ, రాజ రాజేశ్వరి కాలనీ, జగనన్న కాలనీ తదితర ప్రాంతాల్లో విచ్చల విడిగా సంచరిస్తూ వాహనదారులకు, గృహిణులకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. ఒక్కోసారి పశువుల కలబడినపుడు ఎవరిమీదకు దూసుకొస్తాయో తెలియక హడలెత్తిపోతున్నారు.

రోడ్లపై వదిలేస్తున్నారు



యాజమానులు పశువులను రోడ్లపై వదిలేస్తున్నారు. రోడ్లపై అడ్డంగా తిష్ట వేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. శివాలయం దగ్గర రోడ్డుపై అడ్డంగా పడుకొని ఉంటాయి. ద్విచక్ర వాహనాల్లో ఏవి పెట్టుకున్నా బండిని కిందకు తోసి.. అందులో ఉన్న వాటిని తింటున్నాయి. దీనికితోడు మేతలేక ఆవులు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. పశువుల పోషణ చేతకాక రోడ్లపైన, వీధుల్లోకి వదలడం సరికాదు.

– బండి ప్రసాద్, చిన్మయనగర్

చర్యలు తీసుకోవాలి



చిన్మయనగర్‌లో పశువులు ప్రధాన రహదారులపై సంచరిస్తున్నాయి. వీధుల్లో సైతం పదుల సంఖ్యలో తిరుగుతున్నాయి. వాటికి కనీస ఆహారం, సేద తీరేందుకు స్థలం లేక ఎక్కడపడితే అక్కడే తిష్టవేస్తూ, ప్రమాదాలకు గురవుతున్నాయి. పశువులు రోడ్లపై తిరగడం వలన వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లపై తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారులు చేసుకుంటున్న వారు పశువులకు భయపడిపోతున్నారు. ఒక్కసారిగా 20 పశువులు వచ్చి బండ్లపై ఉన్న వాటిని తింటున్నాయి. పశువులు వీధుల్లో విచ్చల విడిగా తిరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కొండూరు మహేశ్వర్, చిన్మయనగర్

యజమానులపై కేసులు పెడతాం



పశువులను రోడ్లపైకి, వీధుల్లోకి వదలొద్దని పలుమార్లు యాజమానులకు నోటీసులు ఇచ్చాం. రోడ్లపై బైఠాయిస్తున్న పశువులకు సంబంధించి మైక్ ద్వారా ప్రచారం చేసినా, పశువుల యాజమానులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటాం. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. జరిమానా విధించడం లేదా గోశాల నిర్వాహకులతో మాట్లాడి తరలించే ఏర్పాట్లు చేయిస్తాం.

–విజయలక్ష్మి, ఎంపీడీఓ

13 నుంచి ఐద్వా రాష్ట్ర మహాసభలు


సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్ విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అనంతపురం నగరంలో జరగనున్నాయని సంఘం రాష్ట్ర నాయకురాలు సావిత్రి తెలిపారు. మహాసభలకు ముందు నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్లను సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో నాయకులు విడుదల చేశారు. సావిత్రి మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు స్థానిక కృష్ణ కళామందిర్‌లో రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా సినీ దర్శకులు ఉమామహేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల హాజరవుతారన్నారు. వీరితో పాటు గాజుల పద్మజ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ పాల్గొంటారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాఠశాల, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించాలని కోరారు. డ్యాన్స్ మాస్టర్లు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, డ్యాన్స్‌మాస్టర్ వన్నూరుస్వామి, రియాజుద్దీన్, టీవీరెడ్డి, డాన్స్‌మాస్టర్ విష్ణు, ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకురాలు రామాంజినమ్మ, నాయకులు జూటూరు షరీఫ్, లక్ష్మీనారాయణ, చిన్నరాముడు, బషీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డులో డివైడర్లా..!


డివైడర్ల ఏర్పాటు కోసం రోడ్డు మధ్యలో తవ్విన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌క్యాప్)లో భాగంగా నగరాభివృద్ధికి నిధులు వచ్చాయి. వీటితో భవిష్యత్తులోనూ ఉపయోగపడే పనులను ప్రణాళిక బద్ధంగా చేపట్టేలా ఇంజినీర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ నగర పాలక సంస్థలోని కొందరు ఇంజినీర్లు ముందుచూపు లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే శ్రీనగర్ కాలనీలో డివైడర్లు నాణ్యత లేకుండా నిర్మించడంతో రూ.లక్షల్లో నిధులు వృథా అయ్యాయి. ఇప్పుడు కొత్తగా హౌసింగ్ బోర్డు రాంనరేష్ ఫంక్షన్ హాల్ నుంచి ఆదర్శనగర్ వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డు, విస్తరణ, డివైడర్ల పనులకు శ్రీకారం చుట్టారు. బీటీ రోడ్డు వేయడం మంచిదే అయినా.. అక్కడున్న 60 అడుగుల రోడ్డులో డివైడర్లను ఏర్పాటు చేస్తుండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలే రోడ్డు ఆక్రమణలతో కుంచించుకుపోయింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇబ్బంది పడాల్సి వస్తోంది. అటువంటి రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేస్తే మరిన్ని ఇబ్బందులు వస్తాయని అంటున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాల్సిందే

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబిలేసు


టవర్‌క్లాక్ వద్ద రోడ్డుపై బైఠాయించిన నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాకాలోని కుప్పంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబిలేసు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద జై భీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెన్నోబిలేసు మాట్లాడుతూ మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమన్నారు. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. దీనికి సీఎం పూర్తి బాధ్యత వహించాలన్నారు.దుండగులను శిక్షించకుంటే కుల,ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జై భీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామప్ప నాయక్, అనంతపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేష్ కోడవండ్ల, రైతు సంఘం నాయకులు పులి కిష్ట, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది

- జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు


మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్ బాబు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న వారిని, ఇటీవల ఉద్యోగవిరమణ పొందిన టీచర్లను ఆత్మీయంగా సత్కరించారు. పీఎస్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షులు గోసల నారాయణస్వామి అధ్యక్షతన వేడుకలకు డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రపంచంలో అన్ని వృత్తుల కన్నా గౌరవనీయమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. సమాజ అభివృద్ధిలో గురువుల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు మునీర్‌ఖాన్, పీఎస్‌హెచ్‌ఎం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, రాయలసీమ ప్రజా సమాఖ్య అధ్యక్షులు, ఆర్థికవేత్త గోర్తి వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కాదని కార్యక్రమం చేపడతారా?

- కేసు నమోదు చేస్తా జాగ్రత్త!
- ప్రభాకర్ చౌదరి వర్గీయులపై వన్‌టౌన్ సీఐ ఆగ్రహం


చౌదరి వర్గీయులకు వార్నింగ్ ఇస్తున్న సీఐ

అనంతపురం క్రైం: 'ఎమ్మెల్యేని కాదని కార్యక్రమం చేపడతారా..' అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వర్గీయులపై వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. చౌదరి వర్గీయులైన టీడీపీ నేతలు ముక్తియార్, బంగినాగా, గౌస్ తదితరులను వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి స్టేషన్‌కు పిలిపించారు. ఎమ్మెల్యే లేకుండా 'ఆటో కార్మికుల సేవలో' కార్యక్రమాన్ని మీరెలా చేపడతారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా కార్యక్రమాలు చేస్తే కుదరదని హెచ్చరించారు. మీపై కేసు నమోదు చేయాలని ఆదేశాలున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే ఓ టీడీపీ కార్యకర్త ఏదో మాట్లాడబోతే సీఐ మరింత రెచ్చిపోయారు. నన్ను ప్రశ్నిస్తే హీరో అనుకుంటున్నావా అంటూ మండిపడ్డారు. ఆటోలను రోడ్డుపై అడ్డదిడ్డంగా పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించారంటూ కేసు నమోదు చేస్తానని బెదిరించారు. నగరంలో ఓ బ్యాంకు చైర్మన్‌గా పని చేస్తున్న వ్యక్తి కూడా చాలా అతి చేస్తున్నారని, ఎమ్మెల్యేని కాదని కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలతో తమను స్టేషన్‌కు పిలిపించి వార్నింగ్‌లు ఇవ్వడాన్ని చౌదరి వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్వయాన సీఎం చంద్రబాబు వార్డుల వారీగా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని, ఇక్కడ అలా తాము చేపడితే నేరంగా మారిందంటూ వాపోయారు. 40 ఏళ్లుగా టీడీపీలో ఉన్న తమకు ఇచ్చిన ఈ బహుమతిని ఎప్పటికీ మరచిపోలేమంటూ వాపోయారు.

కమనీయం.. కల్యాణం


కల్యాణోత్సవం జరిపించేందుకు ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: లోక కల్యాణార్థం నాలుగు రోజుల పాటు వైభవోపేతంగా సాగే వివిధ దేవతా మూర్తుల కల్యాణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీశివబాలయోగి ఆశ్రమంలో వేదపండితులు శాస్త్రోక్తంగా పరిణయ ఘట్టాలను జరిపించారు. ఆశ్రమ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ మాట్లాడుతూ 6న అనంతేశ్వరి, అనంతేశ్వరుల కల్యాణం, 7న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం జరుగుతాయన్నారు. 8న ముగింపు వేడుకల్లో భాగంగా అభయాంజనేయస్వామి సహిత నవగ్రహాలకు పూర్ణకుంభ కలశాలతో అభిషేక వేడుకలు సాగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పంపనూరుకు పోటెత్తిన భక్తులు


దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దసరా సెలవులు, ఆదివారం కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు అనంతరం ఆకు పూజ నిర్వహించి, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామికి, పార్వతి దేవికి కూడా అభిషేకాలు నిర్వహించి, మహా మంగళహారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు నిర్వహించారు. స్వామి వారి స్వర్ణ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఎన్నాళ్లీ అవస్థలు?!


లేబర్ ఐసీయూలో పడకలు లేక ఇబ్బంది పడుతున్న బాలింతలు (ఫైల్)


వ్యాక్సినేషన్ గదిలో కుర్చీలు లేకపోవడంతో నేలపై కూర్చున్న బాలింతలు (ఫైల్)

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో రోజురోజుకూ సౌకర్యాలు కొరవడుతున్నాయి. గైనిక్ విభాగంలో సరిపడా పడకలు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు అవస్థ పడుతున్నారు. ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు ఉండాల్సి వస్తోంది. రాత్రి వేళలో కటిక నేలపై పడుకోవాల్సి వస్తోందని బాలింతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడే జన్మించిన పసికందులకు రోజూ లేబర్ వార్డు ఆపరేషన్ థియేటర్ ప్రవేశ మార్గంలోని గదిలో వ్యాక్సిన్ అందిస్తారు. అక్కడ బాలింతలు కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. జిల్లాకేంద్రంలోని సర్వజనాస్పత్రిలోనే ఇలాంటి దుస్థితి ఉండడంపై పలువురు మండిపడుతున్నారు.

ఘోరంగా స.హ.చట్టం అమలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

అనంతపురం కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం వెరసి సమాచార హక్కు చట్టం అమలు తీరు రాష్ట్రంలో ఏమాత్రం బాగోలేదని వక్తలన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో 'సమాచార హక్కు చట్టం –అధికారుల వైఖరి–ప్రజా సంఘాల అభిప్రాయాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమాచార హక్కు చైతన్య వేదిక వ్యవస్థాపకులు కొండయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు హొన్నూరప్ప, ఫైట్ ఫర్ రైట్స్ అధ్యక్షుడు కేపీ రాజు, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, రైతు సంఘం శ్రీనివాసరెడ్డి ముఖ్య వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి ఈనెల 13న నగరంలోని టవర్‌క్లాక్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని తీర్మానించామన్నారు. ప్రజలు కూడా చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు టీపీ రామన్న, ఏజీ అనిల్ కుమార్‌రెడ్డి, భానుజ, రవికాంత్‌రమణ, శ్రీనివాసులు, రషీద్‌బాషా, వెంకటేష్, నబీరసూల్, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

అనంతపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు పాటుపడిన వారికి అవార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. అవార్డుల ప్రదానోత్సవాన్ని సోమవారం సాయంత్రం 4 గంటలకు నగరంలోని హోటల్ అలెగ్జాండర్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

యువకుడి కోసం గాలింపు


అట్టే పోతులయ్య

రాప్తాడు: పాలచెర్లకు చెందిన అట్టే పోతులయ్య అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ నెల 4న మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్రామ సమీపంలోని తోట దగ్గరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. ప్రేమించిన అమ్మాయిని 'మైనార్టీ తీరలేదు' అనే పేరుతో పోలీసుల సమక్షంలో విడగొడితే.. ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు వేరొకరికిచ్చి పెళ్లి చేయడానికి సంబంధాలు చూస్తున్నారని తెలిసి ఆమె లేని జీవితం వద్దని పురుగుమందు డబ్బాతో సెల్ఫీ వీడియో తీసి అదే రోజు సాయంత్రం నార్పల మండలంలోని స్నేహితుడికి షేర్ చేశాడు. అనంతరం సెల్‌ఫోన్ స్విచాఫ్ చేశాడు. ఆ వీడియోను సదరు స్నేహితుడు పోతులయ్య కుటుంబ సభ్యులకు పంపించారు. అప్పటి నుంచి అతడి కోసం ఎన్నిచోట్ల గాలించినా ఆచూకీ కనిపించలేదు. దీంతో ఆదివారం రాప్తాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే రాప్తాడు సీఐ సెల్ నంబర్ 94407 96817కు తెలియజేయాలని కోరారు.

నేడు పీహెచ్‌సీలో వినాయక విగ్రహ ప్రతిష్ట


విగ్రహాన్ని ఏర్పాటు చేసే మందిరం

రాప్తాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సోమవారం వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు సీహెచ్‌ఓ శివప్రసాద్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గ్యార్మీ వేడుకలు


ప్రార్థనలు చేస్తున్న ఎస్పీ పి. జగదీష్

అనంతపురం: మతసామరస్యానికి ప్రతీకగా జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నిలుస్తుందని ఎస్పీ పి. జగదీష్ అభిప్రాయపడ్డారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని మహబూబ్ సుబహాని దర్గాలో ఆదివారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు సంబంధించి ప్రార్థనా మందిరాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఆయా పర్వదినాల్లో జిల్లా పోలీసు శాఖ ఘనంగా నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇక్కడ అన్ని మతాల వారు ఒక్కటేననే భావనతో ఉండడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు వెంకటేశులు, రవిబాబు, శ్రీనివాస్, పలువురు సీఐలు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఈ నెల 7న విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా ఆర్థిక పరమైన ఏ నిర్ణయాలు తీసుకోకపోవడం దురదృష్టకరం అన్నారు. వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.